
# సాన

రోహిణి కార్తె... ఎండ - చండ్రనిప్పులు కక్కుతోంది ...

ఏ వీధిలోనూ మనిషి కదుల్తోన్న జాడే కనిపించటం లేదు. మధ్యాహ్నం సరిగా రెండు గంటలు "కత్తులకి సానండీ ... సాన ..." మీరా గొంతుచించుకొని అరుస్తోంది. ఆ అరుపులో "ఉదయం" కరిగిపోయింది. ఇప్పుడు "మధ్యాహ్నం" కూడా కరిగిపోతోంది.

అప్పటికి సంపాదన లెక్కపెడితే సరిగా రెండ్రూపాయిలూ ఆపైన నలభై పైసలు మాత్రమే కనిపిస్తున్నాయి.



- రసరాజు

"పాతిక రూపాయలు తెస్తేనే వాడికీ నీకూ రాత్రి భోజనం ..." ఆ ఉదయం పిన్ని వేసిన ఆర్డరు మీరాను మరింత భయపెట్టసాగింది. ఒక భుజంపై సానమిషను - మరో భుజంపై అన్నంతో వున్న సంచి ...

ఆ రెండింటిని మోసే శక్తి కూడా రానురాను మీరాలో నన్నగిల్లిపోతోంది.

ఉదయం తెచ్చుకొన్న అన్నం ఆ రోజు పన్నెండయినా ఎందుకో తినాలనిపించలేదు. దానికి కారణం - బేరం ఏమీ లేకపోవటమే !...

అదిప్పుడు తినాలనుకున్నా నోరు తిరగబడుతుంది. దానికి కారణం -

అది గత రాత్రి వండిన అన్నం కావటమే !...

ఓ పక్క కాళ్ళు మాడిపోతున్నాయి ...

మరో పక్క దాహంతో నోరు పిడచకట్టుకుపోతోంది ...

ముఖం చూస్తే ఎర్రగా కందగడ్డలా ఉంది ...

ముచ్చెమటలు నరేసరి ...

"కత్తులకి సానండీ సాన ..." మీరా లేని ఓపిక తెచ్చుకొని అలాగే అరుస్తోంది.

మీరా వయస్సు పధ్నాలుగేళ్ళు ...

చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకొంది. సవతి తల్లిగా నాగూరమ్మ ప్రవేశించటంతో - కష్టాలకు, కన్నీళ్ళకు విధిలేక తలొగ్గాలసివచ్చింది. తండ్రి ఎక్కడో చాలా దూరంలో పని చేస్తూ - వారానికోసారి కాని ఇంటికి రాడు. తనకో తమ్ముడు. వాడి పేరు సైదులు. ఎనిమిదేళ్ళుంటాయి ...

నాగూరమ్మ భర్తకు ఏది చెప్పితే అది వేదం. తండ్రి వస్తున్నాడంటే తాయిలాలకి బదులు తన్నులు తిని పిస్తుందనే భయం వాళ్ళలో రోజురోజుకి పెరుగుతూ వస్తోంది.

"మీరాలో అలసట ఎక్కువయిపోయింది.

మంచినీళ్ళ కోసం అటూయిటూ చూసింది.

అల్లంత దూరంలో - ఓ కొట్టు దగ్గర ఎవరో ఒక అబ్బాయి మంచినీళ్ళు తాగుతూ కనిపించాడు.

మీరా అక్కడికెళ్ళింది.

కడుపునిండా మంచినీళ్ళు తాగింది.

అక్కడ కాసేపు కూర్చోవాలనిపించింది.

కూర్చుంది ...

మీరా కంటి తీరూ, ముక్కుతీరూ కొట్టొచ్చేలా వుంటాయి. మరో రెండేళ్ళలో పదహారో ప్రాయంలో అడుగుపెట్టబోతోంది. ఆ లక్షణాలు ఇప్పుడిప్పుడే ఆ అమ్మాయిలో మొగ్గతొడగటం ప్రారంభించాయి.

మీరా ఒక్కసారిగా తుళ్ళి పడింది.

ఆ కొట్లో కుర్రాడు తన వంకే గుచ్చి గుచ్చి చూడటం గమనించింది.

అక్కడో నిమిషం కూడా ఉండలేకపోయింది.

మళ్ళీ రోడ్డెక్కింది -

మళ్ళీ గొంతుక్కి పని మొదలయింది - "కత్తులకీ సానండీ ... సాన ..." ఇంచుమించుగా ఆ రోజంతా - ఆ ఊళ్ళో వున్న వీధులన్నిటినీ చుట్టబెట్టేసింది మీరా.

సాయంత్రం నాలుగు -

ఇంకా ఆ రెండ్రూపాయిల నలభై పైసలే ! పెరగలేదు ...

ఏం చేయాలో మీరాకు అర్థం కాలేదు.

పాతిక రూపాయలు తీసికెళ్ళి - పిన్ని చేతిలో పోయకపోతే - ఆ రాత్రికి సైదులికీ, తనకీ పస్తే ...



రామం: మరో జన్మ నేను కోరడం లేదు..

సోమం: ఈ వేదాంతం ఎప్పుడు పుచ్చుకున్నావేంటి?

రామం: ఇది వేదాంతం కాదు. వేదన..జన్మ జన్మల్లోనూ తానే నా భార్య కావాలని కోరుకుంటుంది మా ఆవిడ.

-కమల్‌కాంత్
సైఫాబాద్ కాలనీ,
హైదరాబాద్.

ఏం చేయాలి ... ఏం చేయాలి ... ఇదే ఆలోచన.

ఆ ఆలోచనకు తోడు - ఆవేదన ...

సైదులు భోంచేశాడో లేదో ...

అలా ఆలోచిస్తూ ... గొంతు చించుకొంటూ ... సినిమా హాల్ సెంటర్ దాటి ఆంజనేయస్వామి గుడి వీధిలోకి అడుగుపెట్టింది మీరా.

అక్కడో టీ బడ్డీ కనిపించింది.

ఏమైనా సరే టీ త్రాగాలనిపించింది.

కాలం కలిసొస్తే - సైదులికీ, తనకీ ఆ రాత్రి "పస్తు గండం" తప్పిపోవచ్చు ...

వేడివేడి టీ గొంతులో పడ్డాక - కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది.

ఆరుగంటల కల్లా అదే పరిసరాల్లో ఇరవై రూపాయిలకి చేరుకొంది బేరం. ఇప్పుడిక ఫర్వాలేదనుకొంది. ఆ రాత్రి భోజనంపై కొంత నమ్మకం కుదిరింది. ముఖంలో కాస్త ఆనందం విచ్చుకొంది. మెరుపులాంటి ఆలోచన అంతలో తళుక్కుమంది.

మీరా ఆంజనేయస్వామి కోవెలలో అడుగుపెట్టింది.

స్వామికి రెండు చేతులూ జోడించి - అక్కడున్న హుండీలో రూపాయి బిళ్ళ వేసింది.

ఓ సారి తృప్తిగా గాలి పీల్చింది.

మళ్ళీ రోడ్డెక్కింది.

ఏది ఏమైనా ఎనిమిదిగంటలకల్లా ఇల్లు చేరాలనుకొంది.

రోజూ అయిదారుగంటలకే పదో పరకో సంపాదించి మీరా ఇంటి గడప తొక్కటం ఆనవాయితీ.

అయితే ఆ రోజు పిన్ని ఆర్డరు పాతిక రూపాయల వరకు పాకిపోవటంతో ఇంటికి చేరే సమయంలో మార్పు తప్పనిసరైంది. మరో రెండు గంటలే వ్యవధి. ఇంకా అయిదు రూపాయలు సంపాదిస్తే చాలు ! ... సంపాదించాలి.

ఆ నిర్ణయింతో - తన గొంతును కొత్తరకంగా మార్చింది ...

"ఇరవై పైసలకే సానండీ సాన ... కత్తులకీ సాన ..."

రూపాయికీ తక్కువకాకుండా అంతవరకు సాగిన సాన - తప్పనిసరి పరిస్థితులలో ఇరవై పైసలకి పడిపోయింది. భుజం నొప్పి పుడుతున్నా - ఆకలి కేకలేస్తున్నా - ఏ మాత్రం సడలిపోకుండా మీరా ముందుకు సాగిపోతూనే వుంది.

స్టేషన్‌రోడ్డు మలుపుతిరిగింది.

అక్కడన్నీ టైలరింగ్ షాపులు ...

గొంతులో "టేప్" మళ్ళీ ఆన్ చేసింది.

"ఇరవై పైసలకే సానండీ సాన ... కత్తులకీ సాన ..."

ఓ టైలర్‌వాలా నాలుగు కత్తెర్లు ఇచ్చాడు.

మరో వాలా రెండు కత్తెర్లు ఇచ్చాడు.

పావు తక్కువ ఎనిమిది.

చేతులు బొబ్బలెక్కి పుళ్ళుపుళ్ళుగా తయారయిపోయాయి.

పాతిక రూపాయిలే కాదు - అదనంగా మరో అర్ధరూపాయి కూడా లెక్కలో తేలింది.

"జై వీరాంజనేయా ..." మీరా ఒక్కసారిగా సంతోషంతో ఎగిరి గంతేసింది.

ఎనిమిదీ పదినిమిషాలు -

మీరా రొప్పుతూ రొజుతూ ఇల్లు చేరింది.

"ఏమే ... ఎవడు దొరికాడే ... ఇంత సేపున్నావు" పిన్ని కెరటంలా విరుచుకుపడింది.

"పిన్నీ ! ... " మీరా కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు సుళ్ళుగా తిరిగిపోయాయి.

"మాట్లాడవే ..." మళ్ళీ గద్దించింది.

మీరా చెంప ఛెళ్ళుమంది.

పక్కనే సైదులు.

సైదులు కళ్ళల్లో కన్నీటి సముద్రాలు ...

నాగూరమ్మ చేతిలో ఆ "ఆర్డరు సొమ్ము" మీరా గుమ్మరించింది.

"డబ్బులు ఇప్పుడా తెచ్చేది ... అన్నం ఎలా వండుతారనుకొన్నావే ..." నాగూరమ్మ నాగుపాములా తోక మీద లేచింది.

మీరా మాట్లాడలేదు ...

సైదులు గొంతు విప్పలేదు ...

భోజనం మాటెత్తకుండా నాగూరమ్మ పక్కమీదికెళ్ళిపోయింది.

"తమ్ముడూ ! పిన్ని భోంచేసిందా? ..." రాత్రి సైదుల్ని అడిగింది మీరా మెల్లగా.

"ఆఁ ..." అన్నాడు సైదులు

"అక్కా ... ఆకలేస్తోందే ..." సైదులు అక్క భుజం కదుపుతూ అడిగాడు.

మీరాకు ఏం చేయాలో బోధపడలేదు.

మెల్లగా వంటగదిలోకెళ్ళి అన్నీ వెతికింది.

ఎక్కడా మెతుకు వాసన తగలలేదు.

తడిసిన గుండెతో - కాసిని మంచినీళ్ళు తెచ్చి సైదులికి అందించింది మీరా.

సైదులు ఇంకా కావాలన్నాడు.

మీరా వస్తోన్న ఏడుపును గొంతుదగ్గరే నొక్కేసి -ఉ మరో గ్లాసు మంచినీళ్ళు తెచ్చి సైదులికి అందించింది.

సైదులు మంచినీళ్ళు తాగి - గుట్టుగా అక్క అరచేతులికి కొబ్బరినూనె రాశాడు.

ఆ రాత్రి - లోపటికి పోయిన మీరా పొట్టలో తలపెట్టుకొని భయం భయంగా కునుకుతీశాడు పాపం సైదులు.

* * * *

సైదులు ఆ రోజు పొద్దున్నే లేచాడు.

మీరా ఎనిమిది దాటితే గాని వీధిన పడదు ...

సైదులు మూలనున్న సాన మిషను తీసికొచ్చి అరుగు మీద పెట్టాడు. ఇంట్లో ఎందుకూ పనికిరాకుండా వున్న నాలుగైదు ఇనుప రేకు ముక్కల్ని సేకరించాడు.

వాటికి సాన పెట్టడం మొదలు పెట్టాడు.

అలా ఒక రోజు కాదు - వారం రోజులు ...

అక్క కష్టాన్ని - సైదులు ఎంత మాత్రం భరించలేక పోయాడు ...

ఆ కన్నీళ్ళని ప్రతిరోజు తను రహస్యంగా తుడవలేక పోతున్నాడు ...

అక్క స్థానంలో తను వీధినపడాలి ...

అక్క సంపాదించే దానికంటె - మించి తను తీసుకురావాలి ...

అక్క భుజంపై ఇక సానమిషను కనిపించకూడదు ...

అక్క ఎంతమాత్రం గడపదాటకూడదు ... దాట కూడదు ... కూడదు ...

"కత్తులకీ సానండీ ... సాన ..." - ఇదే సైదులు భావి కార్యక్రమం.

నాగూరమ్మ అడిగింది "ఎట్రా ఆ పని? ..." అని

"నేను కూడా నేర్చుకొంటున్నా పిన్నీ ..." అన్నాడు సైదులు.

సైదులు సాన నేర్చుకొంటున్నప్పుడల్లా - అరుగు మీద కిటికీలోంచి లోపలికి పిన్ని వంక చూస్తూనే ఉన్నాడు.

ఆ చూపు నాగూరమ్మకు అదోలా అనిపించింది.

పిన్ని - సాన పని ఎక్కడ వద్దంటుందో అని భయం భయంగా ఆమెకేసి చూస్తూండేవాడు.

సాన దగ్గరున్నంతసేపు సైదులు సీరియస్‌గా ఆ పని నేర్చుకోవటంలోనే నిమగ్నమయిపోయేవాడు.

ఆ సీరియస్‌నెస్‌నీ, ఆ దీక్షనూ నాగూరమ్మ సరిగా అర్థం చేసుకోలేకపోయింది.

సైదులు మధ్య మధ్య తనవంకే చూస్తూ - సీరియస్‌గా చేస్తున్న పని నాగూరమ్మను ఎందుకో కలవరపెట్టసాగింది.

"నేను కూడ నేర్చుకొంటున్నా పిన్నీ ..." అన్నా ఎందుకో నమ్మలేకపోయింది.

ఇద్దరు పిచ్చివాళ్ళు ఇలా మాట్లాడుకుంటున్నారు.

మొదటివాడు: చాలా కాలంగా నన్నో ప్రశ్న వేధిస్తుందిరోయ్..

రెండవవాడు: ఏమిటది?

మొదటివాడు: రాత్రివేళ సూర్యుడు ఎక్కడికి వెళ్తాడంటావ్?

రెండవవాడు: సూర్యుడు ఎక్కడికో వెళ్ళడమేమిటి! తనని మనం చూడాలని నల్లగా ఉంటాడంతే..

-పి. మార్కండేయ
కరీంనగర్.

రేకు ముక్కలన్నీ పదును తేలి, మొనతేలి, చాకుల్లా తయారవుతుంటే - వాటిని నాగూరమ్మ చూడలేకపోతోంది.

ఆ తళతళలను భరించలేకపోతోంది.

ఇపుడు నాగూరమ్మ మనస్సంతా సైదులు పైనే.

* * * *

ఎదురుగా సైదులు —

ముఖమంతా కక్షతో కోపంతో ఉడికిపోతోంది.

చేతిలో పదును తేరిన చాకు ...

అది తళతళ మెరిసిపోతోంది ...

ఒకో అడుగూ వేసికొంటూ తనను సమీపించటం నాగూరమ్మ గమనించింది.

"అక్కను కొడతావా ..." సైదులు హుంకరించాడు.

"నీ కోసమే ఈ రేకుల్ని సాన పెట్టా ... చూడు ... "

"అన్నం పెట్టకుండా మాడుస్తావే ..." చాకు పైకి లేచింది.

నాగూరమ్మకు ఒక్కసారి నెత్తురంతా గడ్డ కట్టుకుపోయినట్టుగా అనిపించింది.

ఆ హఠాత్పరిణామానికి ఒక్కసారి కళ్ళు బైర్లు కమ్మాయి.

అంతే ...

ఆ పదును తేరిన చాకు నాగూరమ్మ గుండెల్లోకి సూటిగా దూసుకుపోయింది.

ఒకే ఒక్క గావు కేక —

నాగూరమ్మ కిందికి పడిపోయింది.

ఆ పక్కనే పడుకొన్న మీరా, సైదులు ఉలిక్కిపడి కంగారుగా పైకిలేచారు.

"ఏంటి పిన్నీ ఏమైంది? ..." మీరా అడిగింది.

సైదులు వంక నాగూరమ్మ - కొంచెం భయంగా, కాస్త కోపంగానూ చూస్తోంది.

"పాడుముండా కల ... రక్తం తోడేసింది ... మంచినీళ్ళుతే ..." నాగూరమ్మ ఆయాసపడుతూ అడిగింది.

"ఏం కల పిన్నీ ..." మీరా అడిగింది.

"ఏదో లే ..." నాగూరమ్మలో ఆ కల తాలూకు కలకలం ఇంకా వీడిపోలేదు.

అది ఆమెకు కలగా ఎంతమాత్రం అనిపించటం లేదు.

అంతా జరిగినట్లుగా వుంది.

తెల్లారింది ...

* * * *

రెండు రోజులు గడిచిపోయాయి.

నాగూరమ్మ ప్రవర్తనలో వింత మార్పు కనిపిస్తోంది.

రాక్షసంగా వున్న నాగూరమ్మ "సాన" పట్టకుండానే - ఎందుకిలా మనిషిగా మార్పు చెందిందో అర్థం కాలేదు - ఆ ఇద్దరు పిల్లలకీ. మీరా, సైదులు - ఇపుడు వేడివేడి అన్నం తింటున్నారు.

## స్పందించని గుండె

గుండె జబ్బుతో బాధపడే వ్యక్తులు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వీరి జీవిత కాలాన్ని పొడిగించటానికి ఆధునిక విజ్ఞానం ఎంతో కృషి చేస్తున్నది.

ప్రస్తుతం, దెబ్బతిన్న గుండెలను పని చేయించటానికి అమర్చే పంపులను హృదయకండరాలలాగా పని చేసేట్లుగా రూపకల్పన చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ పంపులు రక్తాన్ని నిరంతరం ప్రవహింపజెయ్యగలవు. దీనివల్ల బలహీనమైన వల్వ్ ఉన్న రోగులు కాని, వల్వ్‌లేని రోగులు కాని మామూలు జీవితం గడపగలరు.

వల్వ్ ఉండని హృదయపు పంపులను రూపొందిస్తున్న క్లీవ్‌లాండ్ క్లినిక్ సంస్థకు చెందిన డాక్టర్ గోల్డిర్ రక్తప్రసారం, పీడనం, ఘనపరిమాణం తగినంతగా ఉన్నంతసేపు వల్వ్ అవసరం లేదని అంటున్నారు. వల్వ్ కలిగించాల్సిన అవసరంలేని పంపు నిర్మాణం సులభంగా కూడా ఉంటుంది.




ప్రస్తుతం లేగదూడల్లో పరీక్షిస్తున్న నాన్-పల్సింగ్ పంప్‌లో ఒకే ఒక చలించే భాగం ఉంటుంది. ఇందులో సీలు చేసిన ఒక ఎలక్ట్రిక్ కాయిల్ చుట్టూ మాగ్నెట్స్ కలిగిన రోటార్ తిరుగుతూ ఉంటుంది. రోటార్‌కు కందెనగా రక్తం మాత్రమే ఉపయోగించబడటం వల్ల ఇతర కందెనపదార్థాలు శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం లేదు.

వల్వ్ కలిగించే పంపు ఖరీదు యాభై వేల డాలర్లు ఉంటుంది. దీంట్లో సగం ఖరీదు ఉండే నాన్ పల్సింగ్ పంప్ డిజైన్ సింపుల్‌గా ఉండటమే కాక నమ్మకంగా పని చేస్తుంది కూడా. దీని పరిమాణం తక్కువగా ఉండటం వల్ల ఛాతీలో తేలికగా అమర్చవచ్చు. రాబోయే మూడు సంవత్సరాల కాలంలో ఈ రకం పంపులను మానవుల్లో ఉపయోగించటం జరుగుతుందని శాస్త్రజ్ఞులు ఆశిస్తున్నారు.

- మహావాది